
సాక్షి ఒడిశా
శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,88,349లు, బంగారం 2.7 గ్రాములు, వెండి 13.35 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మహో.. వరద

- 8లో



విద్యార్థినికి ప్రోత్సాహం

- 8లో

న్యూస్‌రీల్

మల్కన్‌గిరిలో దివ్యశంకర్ మిశ్రో పర్యటన



పార్టీ కార్యకర్తలతో చర్చిస్తున్న దివ్యశంకర్ మిశ్రో

మల్కన్‌గిరి: బీజేడీ జిల్లా పరిశీలకుడిగా నియమితులైన మాజీమంత్రి కెప్టెన్ దివ్యశంకర్ మిశ్రో మల్కన్‌గిరి మల్కన్‌గిరిలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక టౌన్ హాలులో పార్టీ నాయకులు, మున్సిపల్ చైర్మన్ మనోజ్ బారిక్ ఘన స్వాగతం పలికారు. అనంతరం మిశ్రో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీని ఏ విధంగా గెలిపించాలో సూచనలందించారు. అలాగే క్షేత్రస్థాయిలో బీజేడీని మరింత బలోపేతం చేసే విషయమై సూచనలు, సలహాలు స్వీకరించారు. పర్యటనలో బీజేడీ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్, బీజేడీ సీనియర్ అధ్యక్షుడు ఈశ్వర్ ప్రాణిగ్రహి, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, మల్కన్‌గిరి బీజేడీ సలహాదారుడు రాజేంద్ర పండా, జిల్లా అభివృద్ధి శాఖ అధ్యక్షుడు అద్మార్వా, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే ముకుందో సోడి, మానస్ మడకామి, మల్కన్‌గిరి పురపాలక సంఘం ఉపాధ్యక్షురాలు కవిత మొహంతో, నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై చర్యలు



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలో 70 మైక్రాన్ల కంటే తక్కువ పరిణామం ఉన్న ప్లాస్టిక్ సంచుల క్రయ, విక్రయాలపై పర్లాకిమిడి మున్సిపల్ అధికారులు నిబంధనలు జారీ చేశారు. అయినా కొందరు టోకు వ్యాపారులు పట్టణంలో విక్రయాలు సాగించడంతో అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. కేవుటి వీధిలో ప్లాస్టిక్ సంచులు గోడౌన్‌పై దాడులు చేసి, రూ.లక్షల విలువైన సరుకును సీజ్ చేశారు. వ్యాపారి అప్పారావు పర్లాకిమిడి పరిసర ప్రాంతాల్లో వీటిని సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ మేరకు అతనిపై మున్సిపల్ అధికారులు కేసు నమోదు చేసి, గోడౌన్‌ను సీజ్ చేశారు.

వినూత్న శిక్షణ



శిక్షణ పొందిన ఖైదీలకు సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని ఉప కారాగారంలో ఖైదీలకు పుట్ట గొడుగుల పెంపకంపై గురువారం నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి కేంద్రం డైరెక్టర్ సైమన్ డుంగ్‌డంగ్ పర్యవేక్షణలో 6రోజులు 28మంది ఖైదీలకు శిక్షణ అందించారు. ఖైదీల విడుదల అనంతరం స్వయం ఉపాధికి పుట్ట గొడుగుల శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను ఆయన అందజేశారు. కోర్సు కో–ఆర్డినేటర్ దిలీప్ తంతి, జైలు సూపరింటెండెంట్ హన్ను శెఠి తదితరులు పాల్గొన్నారు.

● వితరణ..



పర్లాకిమిడి జిల్లాలోని గుమ్మా సమితి జీబ గ్రామంలో ఉన్న సత్యసాయి సేవా మందిరానికి దివ్యపథం(వెల్వెట్ క్లాత్)ను శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పారశెల్లి రామరాజు బహుకరించారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఎస్.గంగాధర్‌కు దీనిని అందజేశారు. కార్యక్రమంలో పి.చిన్నారావు, సుదర్శనరావు, డి.గోపాలరావు, ఎస్.జనార్దనం, జోగారావు, సాయిభక్తులు పాల్గొన్నారు.

-పర్లాకిమిడి

● ఎన్నిక..



ద్విచక్ర వాహన మెకానిక్ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో గురువారం జరిగింది. ఇందులో సంఘం అధ్యక్షుడిగా సుశాంత్‌కుమార్ బెహరా, ఉపాధ్యక్షుడిగా ఐ.తేజేశ్వరరావు, కార్యదర్శిగా పి.గంగాధర్, సంయుక్త కార్యదర్శిగా చిత్తరంజన్ దాస్, కోశాధికారిగా నీలంకఠ సాహు, న్యాయ సలహాదారుడిగా సిరాజుద్దీన్ అహ్మద్ ఎంపికయ్యారు. మరో ఏడుగురిని కార్యవర్గ సభ్యులుగా, నలుగురు సలహాదారులుగా ఎన్నికయ్యారు.

- కొరాపుట్

● నిరసన..



రాయగడ పట్టణంలోని సిరిగుడ వద్ద ఉన విద్యుత్ విభాగం కార్యాలయం ఎదుట గత 3రోజులుగా కొనసాగుతున్న విద్యుత్ కార్మికుల నిరసనపై అధికారులు ఎవరూ స్పందించక పోవడంతో గురువారం ఆందోళన మరింత తీవ్రతరం చేశారు. ఈ క్రమంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. తమ డిమాండ్లు సాధించే వరకు పోరాడతామని విద్యుత్ శ్రమిక్ కర్మచారి సంఘం సర్కిల్(రాయగడ) కార్యదర్శి ప్రఫుల్లచంద్ర మహాపాత్రో వెల్లడించారు.

- రాయగడ

రాష్ట్రంలో పోరాటం కొనసాగిస్తాం



● పార్లమెంట్‌లో 'ఢిల్లీ' బిల్లుకు బీజేడీ మద్దతుపై ఎంపీ పినాకి మిశ్రా స్పష్టీకరణ

భువనేశ్వర్: రాష్ట్రంలో అధికార పార్టీ బిజూ జనతా దళ్ పార్లమెంట్‌లో ఢిల్లీ సర్వీసెస్ ఆర్డినెన్స్ స్థానంలో బిల్లుకు మద్దతు ఇచ్చి, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) నుంచి దాడికి గురవుతోంది. ఈ అంశంపై బీజేడీ వైఖరిని స్పష్టం చేసింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు నగర పాలనలో అధికారుల బదిలీ, పోస్టింగ్‌లపై మరింత నియంత్రణను ఇచ్చే బిల్లుకు బీజేడీ మంగళవారం అధికారికంగా... మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో ఆ పార్టీ పార్లమెంటరీ నాయకుడు గురువారం పినాకి మిశ్రా మాట్లాడుతూ చట్టాన్ని రూపొందించే అధికారం పార్లమెంట్‌కు ఉన్నందున ఆర్టికల్ 239ఏఏ ఢిల్లీకి విచిత్రమైన, ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తుందన్నారు. ఢిల్లీ సర్వీసెస్ బిల్లును అమలు చేసేందుకు పార్లమెంటు అధికారానికి బీజేడీ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఇది బీజేపీకి మద్దతిచ్చే వ్యవహారం కాదని, ఈ చట్టాన్ని రూపొందించే పార్లమెంటు అధికారానికి మాత్రమే బీజేడీ మద్దతు ఇస్తోందని మెలిక వేశారు. బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీజేడీ సమాన దూరాన్ని కొనసాగిస్తోందని స్పష్టంచేశారు. రాష్ట్రంలో బీజేపీతో పోరాడుతూనే ఉంటామని, అదే రీతిలో కాంగ్రెస్‌తో పోరు యథాతథంగా కొనసాగుతుందన్నారు. బీజేపీ తన ప్రయోజనాల కోసం ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలను పడగొట్టడానికి ఏమాత్రం వెనుకాడదని ఆప్ చేసిన హెచ్చరికను ఆయన స్పష్టంగా వివరించారు. ప్రతిఒక్కరూ చట్టం పరిశీలన కోసం వేచి ఉండాలిలని, కోర్టు తీర్పు కోసం వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నట్లు తెలిపారు. ఒడిశా, రాజస్థాన్ లేదా పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి అలాంటి చట్టాన్ని కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టలేదన్నారు. ఈ మేరకు రాజ్యాంగబద్ధంగా ఎటువంటి వెసులుబాటు లేదని ఆయన వివరించారు. రాజ్యసభలో బీజేడీకి 9మంది ఎంపిల బలం ఉంది. బీజేపీ నేతృత్వంలో ఎన్‌డీయేకి మెజారిటీ లేని ఎగువ సభలో బిజూ జనతాదళ్ అండతో మోదీ సర్కార్ దాదాపు సగం వరకు సమస్యను అధిగమించేందుకు మార్గం సుగమం అవుతుంది.

నేటి నుంచి అమిత్ షా పర్యటన





భువనేశ్వర్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం నుంచి రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరయ్యే అవకాశం ఉంది. శుక్రవారం రాత్రి భువనేశ్వర్ లోని బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకొని, విశ్రాంతి తీసుకుంటారు. శనివారం ఉదయం ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా హాజరు కానున్నట్లు సమాచారం. అలాగే వామపక్ష తీవ్రవాదం(ఎల్‌డబ్ల్యూఈ), విపత్తు నిర్వహణ కార్యక్రమాలను సమీక్షిస్తారు. అలాగే జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. భారతీయ జనతా పార్టీ అగ్రనేత అమిత్ షా శని వారం మధ్యాహ్నం పార్టీ రాష్ట్ర శాఖ కార్యాలయంలో జరిగే పార్టీ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అనంతరం స్థానిక విమానాశ్రయం లౌంజ్‌లో ప్రత్యేక సమావేశంలో పాల్గొని అదేరోజు ఢిల్లీకి తిరుగు పయనమవుతారు. మంత్రి పర్యటనకు సంబంధించి అధికారిక సమాచారం జారీ కాలేదు. ఇటీవల గుజరాత్‌ను ప్రభావితం చేసిన బిపార్జోయ్ తుఫాను కారణంగా ఏర్పడిన అసాధారణ పరిస్థితుల దృష్ట్యా జూన్ 17న ఖరారైన అమిత్ షా రాష్ట్ర పర్యటన రద్దు కావడంతో తాజాగా మరోసారి చేపడున్నట్లు హోంశాఖ వర్గాల సమాచారం.

బిల్లుకు మద్దతు ఇవ్వడంతో..

రాష్ట్రంలో అధికార బిజూ జనతాదళ్(బీజేడీ), భారతీయ జనతాపార్టీ(బీజేపీ) మధ్య పొత్తు, సమీకరణాలపై జాతీయ, రాష్ట్ర స్థాయిలో చర్చలు ఊపందుకుంటున్నాయి. దీంతో అమిత్ షా తాజా పర్యటనపై మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ ఢిల్లీ సర్వీసెస్ ఆర్డినెన్స్ స్థానంలో బిల్లుకు మద్దతివ్వడంతో పాటు ఎన్డీఏ ప్రభుత్వంపై వివిధ ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో బీజేడీ–బీజేపీ పొత్తు సమీకరణాలకు సంబంధించి రాజకీయ విశ్లేషకులు భిన్నమైన ఊహాగానాలు ప్రచారం చేస్తున్నారు. అయితే.. బీజేపీ, కాంగ్రెస్ రెండింటికీ సమాన దూరాన్ని కొనసాగిస్తున్నట్లు శంఖం వర్గాలు తరచూ ప్రకటనలు చేస్తున్నారు. వాస్తవ వైఖరి మాత్రం దీనికి భిన్నంగా కనిపిస్తోంది. ప్రాంతీయ పార్టీగా వెలుగొందుతున్న బీజేడీ 2019 నుంచి దాదాపు ప్రతి విషయంలోనూ కేంద్రంలోని నరేంద్రమోదీ పాలనకు మద్దతు ఇస్తోంది. జమ్మూ–కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు–2019కి బీజేడీ మద్దతు ఇచ్చింది. చట్ట విరుద్ధ కార్యకలాపాల(నివారణ) చట్టం, సమాచార హక్కు చట్టాల మార్పులు ప్రతిపాదన, ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణించే బిల్లుల ఆమోదం పురస్కరించుకుని కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి అండగా నిలిచింది. ప్రధానమంత్రి, కేంద్ర హోంశాఖ మంత్రి అభ్యర్థన మేరకు అశ్విని వైష్ణవ్‌ను రాష్ట్ర కోటాలో రాజ్యసభకు నామినేట్ చేశారు. ఆయన ప్రస్తుతం ర్వేశాఖ మంత్రిగా వెలుగొందుతున్న విషయం తెలిసిందే.

ఉపారోసాజ్జ బాధితులకు ఆర్థికసాయం



బాధిత కుటుంబాల చెక్కును అందిస్తున్న మంత్రి జగన్నాథ సరక

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి మజ్జిగుడ పంచాయతీలోని ఉపారోసాజ్జ గ్రామంలో ఈనెల 1న నిర్మాణ దశలో ఉన్న కల్వర్టు సెంట్రింగ్ కూలిన ఘటనలో ఐదుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సీఎం సహాయనిధి నుంచి ఒకొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఆర్థిక సహకారాన్ని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉపారోసాజ్జ గ్రామానికి చేరుకున్న రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక, బిజూ స్వస్థ్య కల్యాణ సమితి రాష్ట్రశాఖ ముఖ్య సలహాదారుడు సుధీర్‌కుమార్ దాస్, జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ వెళ్లి, బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రకటించిన ఆర్థికసాయం పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు రూ.4 లక్షల చెక్కును మంత్రి అందించారు. ఘటనలో లక్ష్మీధర మినియాక(54) అతని కొడుకు ప్రిన్స్(4), రాజు మినియాక కొడుకు చరన్ మినియాక(8), సుమన్ మినియాక, (5), రమేష్ కులిసిక కొడుకు మనోజ్ కులిసిక(5) మృతిచెందారు. వారి కుటుంబీకులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించిన ఆర్థిక సాయాన్ని మంత్రి అందించారు.

ఇద్దరు నిందితులు అరెస్టు



బరంపురం: మాట్లాడుతున్న ఎస్డీపీవో ఉమాశంకర్ స్వాయి



బరంపురం: అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న పోలీసులు



బరంపురం: స్వాధీనం చేసుకున్న సుత్తి

బరంపురం: నగరానికి సమీపంలో ఇటీవల మట్టి కింద యువతి మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను హిజిలికాట్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా గురువారం హిజిలికాట్ పోలీసుస్టేషన్‌లో ఎస్డీపీవో ఉమాశంకర్ స్వాంయి వివరాలు తెలియజేశారు. నిందితుల వద్దనుంచి హత్యకి వినియోగించిన పెద్ద సుత్తిని సీజ్ చేసినట్లు తెలియజేశారు. అరెస్టైనవారిలో గురింటి గ్రామానికి చెందిన సంతోష్ బెహరా, సుషాంత్ బెహరాలు ఉన్నట్లు నిర్ధారించారు. యువతిని గంజాం జిల్లా పట్టపూర్ గ్రామానికి చెందిన బర్షారాణి పురోహిత్‌గా పోలీసులు గుర్తించారు.

దొంగతనం కేసులో...



జయపురం: దొంగతనం కేసులో పట్టుబడిన నిందితులు



జయపురం: స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

జయపురం: ఒక దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి సంబిత్ బెహర తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెల 30వ తేదీన స్థానిక గోపబందునగర్‌కు చెందిన నిరంజన్ మహరాణ ఇంటిలో దొంగతనం జరిగింది. ఇంటిలో బంగారు నక్లెస్, ఒక బంగారు చెవి రింగు, బంగారు ఉంగరం, జత వెండి పట్టీలు, సెల్‌ఫోన్ దొంగతనానికి గురైనట్లు నిరంజన్ మహరాణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ముమ్మరంగా దర్యాప్తు నిర్వహించి నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టైనవారిలో ఒకరు మైనర్ కాగా, మరొకడు రాజీవ్ సాగర్ అని వెల్లడించారు. దొంగిలించబడిన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

జంట హత్య కేసులో...



బరంపురం: అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగర శివారులోని మౌడా గ్రామంలో గత నెల 29వ తేదీన జరిగిన జంట హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బరంపురం ఎస్పీ డా.సార్వణ్ వివేక్ గురువారం తెలిపిన వివరాలు మేరకు... దిగపండి పోలీసుస్టేషన్ పరిధి మౌడా గ్రామానికి చెందిన శిబరామ్ గౌడా, లిట్టురాజ్‌లు గ్రామంలోని పలువురితో వివాదం పెట్టుకున్నారు. దీంతో శిబరామ్ గౌడా, లిట్టురాజ్‌లపై కొంతమంది వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం బండిలో ఉన్న పెట్రోల్‌ను ఇద్దరిపై వేసి తగలబెట్టి హత్యలు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ముగ్గురు నేరస్తులను పోలీసులు అరెస్టు చేయగా, మరో ముగ్గురిని గురువారం అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో శిబరామ్ స్వాంయి, బుడా జగన్నాథ నాయక్, దుక్కిరామ్ మజ్జిలు ఉన్నట్లు నిర్ధారించారు. నిందితుల నుంచి ఇనుప రాయ, గాజు బాటిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

జీవ వైవిధ్యం తప్పనిసరి



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు



వేదికపై అతిథులు

జయపురం: జీవ వైవిధ్యం, నిర్వాహణపై పట్టణంలోని పూల్‌బెడలో ఉన్న ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ కార్యాలయంలో, జయపురం అటవీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన శిబిరం నిర్వహించారు. అటవీ విభాగ ఏఎస్ఎఫ్ సుభాష్‌చంద్ర కుంఠియా, రాష్ట్ర బయో డైవర్సిటీ మేనేజ్‌మెంట్ బోర్డు కో–ఆర్డినేటర్ డాక్టర్ శుభ్రాంశు నాయక్, ప్రాణి పరిశోధకులు డాక్టర్ సత్యరంజన్ బెహరా హాజరై, మాట్లాడారు. వ్యవసాయం, పశు పాలనలో రైతులు ఏ విధమైన యాజమాన్య చర్యలు చేపట్టాలి, వాటిని రక్షించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి అనే అంశంపై వివరించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులకు పాల్గొని, తమ అనుభవాలను పంచుకున్నారు. సుప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్ ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం అందరి బాధ్యతని తెలిపారు.



నినాదాలు చేస్తున్న రైతులు

క్లుప్తంగా

కోటబొమ్మాళిలో జిల్లాస్థాయి చదరంగం పోటీలు

టెక్కలి రూరల్: జిల్లాస్థాయి చదరంగం పోటీలను ఈ నెల 6వ తేదీన కోటబొమ్మాళి మండల కేంద్రంలోని ఎంజేపీఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 1.1.2012 తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ముందుగా రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి తమ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని జిల్లా చెస్ అసోసియేషన్ చీఫ్ కోచ్ బగ్గు అభినవ్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎపిచెస్.ఓఆర్‌జి వెబ్ సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7416864642 నంబర్‌కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

ట్రాన్స్‌జెండర్‌కు రేషన్ కార్డు మంజూరు



రేషన్ కార్డుని అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళంలోని రెల్లివీధికి చెందిన గురుమూర్తి అలియాస్ రేణుక అనే ట్రాన్స్‌జెండర్‌కు జెండర్ మార్చి రేషన్ కార్డును అందజేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు గురువారం కార్డును అందజేశారు. ఇంతకుముందు ఆ రేషన్ కార్డులో జెండర్ పురుషుడు అని ఉండేది. దాన్ని ట్రాన్స్‌జెండర్‌గా మార్చాలని రేణుక సచివాలయ సిబ్బందిని కోరారు. సాంకేతిక కారణాల వల్ల చాలా రోజులుగా వీలు పడలేదు. దీంతో ఆమె జిల్లా న్యాయసేవాధికా సంస్థను 2022 అక్టోబర్‌లో ఆశ్రయించారు. దరఖాస్తు పరిశీలించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆ సచివాలయ సిబ్బందికి నోటీసులు పంపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది తమపైవారితో సంప్రదింపులు చేసి ఎట్టకేలకు కార్డులోని జెండర్‌ను పురుషుడి నుంచి ట్రాన్స్‌జెండర్‌గా మార్చి గురువారం ఆమెకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యాధికారిణి మృతి



భవ్యశ్రీ (ఫైల్)

సోంపేట: మండలంలోని బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ భవ్యశ్రీ రహదారి ప్రమాదంలో గురువారం సాయంత్రం విశాఖలో మృతి చెందారు. బట్టిగళ్లూరు వైద్య సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భవ్యశ్రీ గురువారం విశాఖపట్నంలో షీలానగర్‌లో జరిగిన డిపార్ట్‌మెంట్ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రాశాక గాజువాకలో బంధువుల దగ్గరకు స్కూటీపై బయల్దేరారు. అయితే లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈవిడ స్వగ్రామం యానాం. భవ్యశ్రీ మృతి చెందడంతో జిల్లా వైద్యాధికారి బొడ్డేపల్లి మీనాక్షి, బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సంతాపం తెలిపారు.

పలాసలో సబ్సిడీ టమాటాల విక్రయం



టమాటాలను తూకం వేస్తున్న దృశ్యం

పలాస: పెరుగుతున్న నిత్యావసర ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించడమే ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎ.ఎం.సి. చైర్మన్ పి.వి.సతీష్ చెప్పారు. పలాస వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం సబ్సిడీ ధరలపై టమాటాల విక్రయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో టామాటా ధరలు బాగా పెరిగిపోవడం వల్ల వాటిని నియంత్రించడానికి మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజు సంబంధిత అధికారులతో మాట్లాడి 1000 కేజీల టమాటాలు తెప్పించినట్లు తెలిపారు. ఒకరికి కిలో రూ.50 చొప్పున అమ్ముతున్నట్లు చెప్పారు. 850 కిలోల విక్రయం జరగ్గా, మిగిలిన వాటిని శుక్రవారం విక్రయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి వాణీప్రసన్న, సూపర్‌వైజరు వైకుంఠరావు, ఆంధ్రయ్య, దుర్యోధన, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ పరీక్షల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నిర్వహిస్తున్న రెండో సెమిస్టర్ పోస్టు గ్రాడ్యుయేషన్ పరీక్షలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు గురువారం పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. పరీక్షలు సజావుగా నిర్వహించాలని, ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.


నేడు ద్విచక్రవాహనాల వేలం

కంచిలి: కంచిలి పోలీస స్టేషన్ పరిధిలో ఏపీ ప్రొహిబిషన్ యాక్ట్ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ ఎస్.బాలరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

మహో.. వరద



మహానది వరద ఉధృతిని సమీక్షిస్తున్న ఎస్ఆర్‌సీ



కటక్ ముండలి బ్యారేజీలో ఎగసి పడుతున్న వరద



ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలు

- ముండలి బ్యారేజీ నుంచి 9,18,383 క్యూసెక్కుల నీరు విడుదల
- వరద నీటి విడుదలకు ఎస్ఆర్‌సీ ఆదేశాలు

భువనేశ్వర్: మహానది వ్యవస్థ పరిధిలోని ప్రాంతాల్లో మధ్య తరహా వరద ముంపు అవకాశం ఉన్న నేపథ్యంలో గురువారం సాయంత్రం 4 గంటల నుంచి కటక్ ముండలి బ్యారేజీ నుంచి నీటి విడుదల స్థిరంగా కొనసాగిస్తున్నారు. సాయంత్రం 5గంటలకు మహానది ఎగువ భాగంలో 94.20 అడుగులు, దిగువన 91.80 అడుగుల నీటిమట్టం కొనసాగుతుందని ప్రత్యేక సహాయ కమిషనర్(ఎస్ఆర్‌సీ) ప్రదీప్ జెనా తెలిపారు. ముండలి బ్యారేజీ వద్ద ఆ సమయంలో 9,18,383 క్యూసెక్కుల నీరు విడుదలకు అనుమతించారు. ముండలి వద్ద ఉదయం నుంచి ఔట్‌ఫ్లో పెరుగుతున్నప్పటికీ సాయంత్రం 4 గంటల నుంచి నిలకడగా ఉంది. ఉదయం బ్యారేజీలోకి 8.28 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండగా, మధ్యాహ్నం 3 గంటలకు 9.10 క్యూసెక్కులు, సాయంత్రం 4 గంటలకు 9.18 క్యూసెక్కులకు ఈ ప్రాంతంలో నీటిమట్టం పెరిగిందని ఎస్ఆర్‌సీ వెల్లడించారు. ముండలి బ్యారేజి గుండా వరద నీటి ప్రవాహం 9.5 లక్షల క్యూసెక్కులు దాటితే అంగుల్, నయాగడ్, కటక్, ఖుర్దా, పూరీ, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా తదితర జిల్లాల్లో మధ్య తరహా వరద నియంత్రణకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. శుక్రవారం నాటికి జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, పూరీ జిల్లాలకు వరదనీరు చేరే అవకాశం ఉంది. ఈ మూడు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉన్నారని జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ భక్తరంజన్ మహంతి తెలిపారు. అంగుల్, నయాగడ్, కటక్, ఖుర్దా, పూరీ, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా జిల్లాల కలెక్టర్లు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని.. బలహీనమైన నదుల గట్లపై నిఘా నిరవధికంగా కొనసాగించాలని వివరించారు.

వైతరణి తగ్గుముఖం..

వైతరణి నది నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. జెనాపూర్ వద్ద బ్రాహ్మణి గురువారం సాయంత్రం 4 గంటలకు 23మీటర్ల నుంచి నీటి మట్టం దిగజారి 22.20 మీటర్ల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. భారీ వర్షాల కారణంగా బౌధ్ జిల్లా జగన్నాథ సడక్ ప్రాంతంలో 5 అడుగుల వర్షపు నీరు ప్రవహించడంతో సంకులేయ్ పంచాయతీ పరిధిలోని 20 గ్రామాలు అతలాకుతలమయ్యాయి.

రాత్రింబవళ్లు నిఘా..

స్థానిక పోలీసులు, జలవనరుల శాఖ ఇంజినీర్ల సహకారంతో ప్రమాదం పొంచి ఉన్న నదీ గట్ల స్థితిగతుల పట్ల రాత్రింబవళ్లు నిఘా కొనసాగించాలని ప్రత్యేక సహాయ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చోట్ల లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేసింది. విద్యుద్దీపాలు, మరుగుదొడ్లు, ఆహార ఏర్పాట్లు, నీరు ఇతరేతర మౌలిక సౌకర్యాలు కలిగిన సురక్షిత ఆశ్రయ స్థలాలకు తరలించాలని స్పెషల్ రిలీఫ్ కమిషనర్ ఆదేశించారు.

ప్రత్యేక సహాయ బృందాలు..

నయాగడ్ జిల్లా గొణియా మండలం 2 గ్రామ పంచాయతీలు(చాముండియా, రసంగ) ప్రాంతంలో నదిగట్లు కోతకు గురయ్యాయి. దీంతో దసపల్లా ప్రాంతానికి అనుసంధానం దెబ్బతింది. అయితే ఈ ప్రాంతాల్లో ఏ గ్రామంలోకి వరదనీరు చొరబడలేదని ఎస్ఆర్‌సీ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అధికారుల పర్యవేక్షణ నిరవధికంగా కొనసాగుతుంతోందన్నారు. పలు ప్రాంతాల్లో నీటిట్టం తగ్గుతోంది. నీటి మట్టం మరింత తగ్గితే అతి త్వరలో రోడ్డు కనెక్టివిటీ పునరుద్ధరించబడుతుందని వివరించారు. భద్రక్, జాజ్‌పూర్, సంబల్‌పూర్, కియోంజర్, మయూర్‌భంజ్, అంగుల్, సోన్‌పూర్, బౌధ్, కంధమల్, బాలాసోర్, కటక్, పూరీ, ఖుర్దా, జగత్‌పదా, జగత్‌సింగ్‌పూర్ 15 జిల్లాలకు 8 ఎన్‌డీఆర్ఎఫ్ బృదాలు, 13 ఒడ్రాఫ్ బృందాలు, 23 అదనపు అగ్నిమాపక బృందాల గాలింపు, సహాయక, పునరుద్ధరణ, పునర్నిర్మాణ ఇతరేతన అనుబంధ కార్యకలాపాల కోసం ప్రభావిత ప్రాంతాల్లో మొహరించినట్లు తెలిపారు.

సైరిగాంలో జ్వరాల సైరన్



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీతులసి

జలుమూరు: సైరిగాం గ్రామంలో జ్వరాల సైరన్ మోగింది. ఇటీవల గ్రామంలో దాదాపు 400 మంది జ్వరాల బారిన పడ్డారు. అయితే వీరికి కనీసం పరీక్షలు జరపకుండా మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు అంటూ నిర్ధారణ చేసి స్థానిక ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్లు మందులు వాడించారని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తానని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డి.లక్ష్మీతులసి అన్నారు. గ్రామంలో జ్వరాలు ప్రబలుతున్నాయని కలెక్టర్ సూచించడంతో గురువారం అక్కడ మెడికల్ క్యాంప్ నిర్వహించి ఆమె సిబ్బందితో మాట్లాడారు. స్థానికంగా ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నప్పటికీ గ్రామస్తులు స్థానిక సంచి డాక్టర్లను ఆశ్రయించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డెంగీ అంటూ ప్రాణాంతకమైన స్టెరాయిడ్లు వాడుతున్నారని వివరించారు. ఇవి తాత్కాలిక ఉపశమనం కలిగించినా రోగి తర్వాత శక్తిని కోల్పోతాడని హెచ్చరించారు. అసలు డెంగీ జ్వరం నిర్ధారణకు జిల్లా కేంద్రంలోనే పరీక్షలు జరిపించాలన్నారు. ఈ నిబంధనలు పాటించకుండా ఐదారుగురు సంచి వైద్యులు వేలాది రూపాయల మందులు కొనిపించారని అన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. గ్రామంలో ఫీవర్, లార్వా సర్వే చేయాలన్నారు. వైద్య శిబిరంలో జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ, అచ్యుతాపురం, జలుమూరు,సైరిగాం మెడికల్ అధికారులు కొయ్యాన అప్పారావు, తాడేల శ్రీకాంత్, పి.గురునాథరావు డివిజనల్ అధికారి వైకే శ్రీనివాసరావు, విస్తరణ అధికారి శిమ్మ సోమేశ్వరరావు తోపాటు సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయ కులు పి.ముసలినాయుడు, ధర్మాన రమణ మూర్తిలు ఉన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహ



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ పెక్కట గ్రామానికి చెందిన వెయిట్‌లిఫ్టర్(40 కిలోలు) జ్యోత్స్న శౌబొరో(15) ఇటీవల జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. ఈ సంర్భంగా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ కలెక్టరేట్‌లో రూ.20 వేల చెక్కును గురువారం అందించి, మరింతగా ప్రోత్సహించారు.

దశల వారీగా ఉద్యమం



విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడుతున్న ఉద్యోగులు

అరసవల్లి: విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోతే దశలవారీ ఉద్యమాల్లో భాగంగా ఈ నెల 10న నిరవధిక సమ్మెకు దిగుతామని విద్యుత్ శాఖ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళం విద్యుత్ సర్కిల్ కార్యాలయం ముంగిట ఉద్యోగుల రెండో రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. 20 మంది ఉద్యోగులు దీక్షలో కూర్చోగా.. వీరికి సంఘీభావంగా జేఏసీ కన్వీనర్ జి.రమేష్, చైర్మన్ ఎం.వి.గోపాలరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, కో-కన్వీనర్లు పైడి యోగేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావు, జి.సురేష్‌కుమార్, శ్యామలరావు, జె. సురేష్‌కుమార్, ఎస్.వెంకటరావు తదితరులు హాజరై నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 4, 5, 6 తేదీల్లో 'వర్క్ టు రూల్' విధానాన్ని ప్రతి విద్యుత్ ఉద్యోగి తప్పనిసరిగా అమలు చేయనున్నారు. ఈక్రమంలో ఈ మూడు రోజులు కూడా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు మాత్రమే ఉద్యోగులు తమ విధులు నిర్వర్తించనున్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చే ఫిర్యాదు పట్టించుకునేదీ లేదని జేఏసీ నేతలు స్పష్టం చేశారు.

లంపిస్కిన్ నివారణకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ముద్ద చర్మపు వ్యాధి (లంపిస్కిన్) వ్యాధి నివారణకు ఈ నెల 30 వరకు టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ ఎం.కిషోర్ తెలిపారు. లంకాం గ్రామంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల వయస్సు ఉన్న తెల్ల పశువులన్నింటికీ టీకాలు వేయించాలని కోరారు. ఈ వ్యాధి బారిన పడితే పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గి రైతులు నష్టపోతారని చెప్పారు. ఈసారి అటువంటి నష్టం రాకుండా పశువులు పెంపకం చేసేవారంతా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగన్నాథం, రాగోలు పశువైద్యాధికారి బి.యోగేశ్వరరావు, డాక్టర్ బి.వి.రాజశేఖర్, సర్పంచ్ చిట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న క్రైస్తవ సంఘ నాయకులు

రణస్థలం: మణిపూర్‌లో గూడు చెదిరిన, గుండె పగిలిన అభాగ్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే న్యాయం చేయాలని రణస్థలం, లావేరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ రూబెన్ కోరారు. మణిపూర్ మారణకాండకు నిరసనగా రణస్థలంలోని డబ్ల్యూఎం చర్చి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు క్రైస్తవులు శాంతి ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్ సత్యవతికు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీలు, క్రైస్తవులు, బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులు, స్త్రీలను వివస్త్రలను చేసి ఊరేగించడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యాక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ సెక్రటరీ దోమాన రత్నం, ట్రెజరర్ జెమ్స్, సభ్యులు భాస్కరరావు, సుధాకర్, ఆమోస్, సురేష్, శైలేష్, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

ఏటీఎం సెంటర్‌లో మోసం

- ఏటీఎం కార్డు చోరీ కావడంతో రూ. 50 వేలు మాయం



శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఓ రిటైర్డు ఉపాధ్యాయుడు ఏటీఎంలో సొమ్మును డ్రా చేస్తుండగా వెనుకన నిల్చున్న ఓ యువకుడు పిన్ నంబర్ చూసి, ఏటీఎం కార్డు చోరీ చేసి రూ.50,161 అతని ఖాతా నుంచి మాయం చేశాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. శాంతినగర్ కాలనీకి చెందిన వుదయాన కృష్ణమోహన్ అనే రిటైర్డు ప్రభుత్వోద్యోగి ఈ నెల 2న తన పెన్షన్ డబ్బులు డ్రా చేసేందుకు డేఅండ్‌నైట్ కూడలి సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. ముందుగా రూ.9 వేలు విత్ డ్రా చేశారు. సర్వర్ డిలే కారణంగా గ్రీన్ లైట్ వెలగకపోవడంతో కార్డు రాలేదు. ఈలోగా నోట్లు లెక్కపెట్టే పనిలో నిగగ్నమవ్వగా.. వెనుక నిల్చున్న 30 ఏళ్ల యువకుడు చాకచక్యంగా ఉపాధ్యాయుని ఏటీఎం కార్డు దొంగిలించాడు. దాని స్థానంలో ఎస్‌బీఐ ఏటీఎం కార్డు పెట్టేశాడు. ఇది గమనించని ఉపాధ్యాయుడు తన కార్డే అనుకుని మిషన్‌లో ఉన్న యువకుని కార్డు తీసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి 9:30 దాటిన తర్వాత ఉపాధ్యాయుని నెంబర్‌కు రూ.10 వేలు, రూ.వెయ్యి, రూ.39,612 వేలు డ్రా చేసినట్లు మెసేజులు రావడంతో ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. వెంటనే కుమారుడికి విషయం చెప్పడంతో ఏటీఎం కార్డు బ్లాక్ చేశారు. ఉదయం రూ.9 వేలు డ్రా చేసే సరికి రూ.1,27,000 రిమైనింగ్ బ్యాలెన్సు చూపించిన కార్డు.. రాత్రి అయ్యేసరికి రూ.77,600 చూపించింది. గురువారం ఉదయం సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఉపాధ్యాయుడు ఫిర్యాదు చేయగా అకౌంట్ స్టేట్‌మెంట్‌ను పరిశీలించారు. రూ.10 వేలు, రూ.వెయి ఏటీఎంలో డ్రా చేయగా, రూ.39,612 విశాఖపట్నం ద్వారకా నగర్‌లో బంగారం షాపులో స్వైపింగ్ చేసినట్లు గుర్తించారు. గురువారం రాత్రి రెండో పట్టణ పోలీసులకు ఉపాధ్యాయుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు



నిరసన తెలియజేస్తున్న స్థానికులు

రణస్థలం: జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం చేపట్టవద్దని రణస్థలం-రామతీర్థాల కూడలిలో స్థానికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. రామతీర్థాలు కూడలిలో హైస్కూల్ ఎదురుగా నారాయణ శెట్టి శ్రీనివాసరావు ఇంటిపై సెల్ టవర్ నిర్మించేందుకు సదరు టెలికం యాజమాన్యం చర్యలు చేపడుతున్నారు. ఈ విషయమై నాలుగు నెలల క్రితం రెండుసార్లు స్థానికులు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సమస్య వివరించారు. జనావాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ వల్ల ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ గురువారం ఉదయం టెలికం ప్రతినిధులు పనులు చేపట్టడంతో స్థానికులు ఆగ్రహిస్తూ పని ప్రదేశంలో బైఠాయించారు. ఆరోగ్యాలకు శాపంగా మారుతున్న సెల్ టవర్ వద్దంటూ నినాదాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

క్రైమ్ కార్నర్

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని పెద్దరోకలపల్లి సమీప రైల్వే ట్రాక్‌పై పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఏఎస్ఐ నర్సింహులు తెలిపారు. మృతుడి వయసు 55 ఏళ్లు ఉండవచ్చని, హౌరా నుంచి చెన్నై వెళ్తున్న హౌరా మెయిల్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పరిశీలించి కేసునమోదు చేయనున్నట్లు తెలిపారు.

భార్యతో గొడవ పడి వ్యక్తి ఆత్మహత్య



విష్ణు గురునాథ్(ఫైల్)

సారవకోట: మండలంలోని మాళువ గ్రామానికి చెందిన విష్ణు గురునాథ్(48) బుధవారం రాత్రి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విష్ణు గురువర్ధన్ గత నెల 31న మద్యం సేవించి ఇంటికెళ్లి భార్య రాధమ్మతో గొడవపడ్డాడు. అనంతరం ఇంట్లో ఉన్న గడ్డి మందు తీసుకుని సమీపంలో ఉన్న తోటలోకి వెళ్లి తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న గురునాథ్‌ను స్థానికులు గుర్తించి 108 అంబులెన్సులో పాతపట్నం సీహెచ్‌సికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం రాత్రి మృతి చెందాడు. భార్య రాధమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసుస్టేషన్లో కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని యువకుడు మృతి



యువకుడి మృతదేహం

కంచిలి: మండల కేంద్రం కంచిలి సమీపంలో రైల్వే ట్రాక్‌పై గురువారం గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతిచెందాడు. పలాస నుంచి కోల్‌కతా వైపు వెళ్లే మార్గంలో ట్రాక్ పక్కన యువకుడి మృతదేహం గాయాలతో పడి ఉంది. సమాచారం అందుకున్న పలాస జీఆర్‌పీ ఎస్ఐ షేక్ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి



కాశీబుగ్గ: పంటపొలంలో ట్రాక్టర్‌తో దమ్ము పట్టి అనంతరం అదే ట్రాక్టర్ కిందపడి యువకుడు మరణించిన విషాద ఘటన గురువారం కంబ్రగడ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గుసాని బ్లాక్ భీంపురం గ్రామానికి చెందిన సవర్ జాక్సన్(25) పలాస మండలం రెంటికోట పంచాయతీ కంబ్రగడ గ్రామంలో పంటపొలాలను ట్రాక్టర్‌తో దమ్ముపట్టేందుకు వచ్చాడు. పని పూర్తయ్యాక పొలం నుంచి రోడ్డుకు ఎక్కించే ప్రయత్నంలో ట్రాక్టర్ బోల్తా పడి నేరుగా గెడ్డలో జారిపడటంతో జాక్సన్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికంగా వరినాట్లు వేస్తున్న మహిళలు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్ కింద ఇరుక్కున్న మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రెంటికోట సర్పంచ్ శాశనపురి తిరుమలరావు, నాయకులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని ఆరా తీశారు.

బొలేరో వ్యాన్ చోరీ

కంచిలి: మండల కేంద్రం కంచిలి మెయిన్‌రోడ్డు పక్కన రెడ్డి ఆస్పత్రి సమీపంలో పార్క్ చేసి ఉంచిన బొలేరో పికప్ మినీ వ్యాన్ చోరీకి గురైనట్లు వాహన యజమాని వంకల సోమేశ్వరరావు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వాహన డ్రైవర్ కొటియా కూర్మారావు ఈ స్థలంలో బుధవారం రాత్రి పార్క్ చేసి తన ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. యజమానికి సమాచారం ఇవ్వడంతో, ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఎస్.బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిక్కోలు తీరంలో అక్కినేని అందగాడు



మీడియాతో మాట్లాడుతున్న నాగచైతన్య

ఎచ్చెర్ల క్యాంపస్: త్వరలో తాను నటించనున్న సినిమా ప్రిపరేషన్‌లో భాగంగా స్టార్‌హీరో అక్కినేని నాగచైతన్య సిక్కోలు తీరాల్లో గురువారం పర్యటించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రచయిత కార్తీక్ మత్స్యకారుల ఇతివృత్తంతో రాసిన కథతో ఈ చిత్రం తెరకెక్కనుండడంతో ఆ చిత్ర యూనిట్ ఎచ్చెర్ల మండలంలోని డి.మత్స్యలేశం పంచాయతీ, కె.మత్సలేశం గ్రామాన్ని సందర్శించింది. ఈ సినిమాకు చందు మొండేటి దర్శకుడు కాగా, గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై చిత్రం నిర్మిస్తున్నారు. దీంతో హీరో, దర్శకుడితో పాటు సహ నిర్మాత బన్నీ వాసు గ్రామంలో కలియతిరిగారు. కె.మత్స్యలేశంకు చెందిన గనగళ్ల రామారావు వలస మత్స్యకారునిగా గుజరాత్ వీరావల్ వెళ్లి సముద్రంలో వేట సమయంలో పాకిస్థాన్ కోస్టు గార్డులకు చిక్కాడు. అప్పటికి ఆయన భార్య రెండు నెలల గర్భవతి, ఆయన మళ్లీ విడుదలైన నాటికి కుమార్తె ఉంది. ఈ సున్నిత ఇతివృత్తాన్ని కథాంశంగా తీసుకుని మానవీయ కోణంలో ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు తెలిసింది. సహజత్వం కోసం ఇక్కడ కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తామని వారు తెలిపారు. ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మిలు పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. నాగచైతన్యను చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో గ్రామానికి వచ్చారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ థైక్వాండో పోటీలకు కొత్తవలస విద్యార్థి


ధ్రువీకరణ పత్రాన్ని ప్రకాశ రావుకు అందజేస్తున్న చీఫ్‌కోచ్ రుకమాకరరావు

కొత్తవలస: ఈ నెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు సౌత్ కొరియాలో జరగనున్న అంతర్జాతీయ థైక్వాండో పోటీలకు మండలంలోని కంటకాపల్లి గ్రామానికి చెందిన ఎం.ప్రకాశరావు ఎంపికైనట్లు చీఫ్‌కోచ్, ఆలిండియా సంఘమిత్ర స్పోర్ట్స్ చైర్మన్ పి.రుకమాకరరావు గురువారం తెలిపా రు. సీనియర్ విభాగంలో (78 కేజీలు) ఆంధ్రప్రదేశ్ థైక్వాండో అసోసియేషన్ తరఫున ప్రకాశరావు ఆడుతాడని చెప్పారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ధ్రువీకరణ పత్రాన్ని ప్రకాశరావుకు ఆయన అందజేశారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జెడ్పీ చైర్మన్‌తో ఏపీ ఎన్జీవో అధ్యక్షుడి భేటీ


జెడ్పీచైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు తదితరులు

విజయనగరం రూరల్: ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కేవీ శివారెడ్డి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు జెడ్పీ చైర్మన్ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కాసేపు ముచ్చటించారు. ఈ భేటీలో ఏపీఎన్జీవో పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో ఏఓ, క్లర్క్ అరెస్ట్

విజయనగరం క్రైమ్: పోలీస్ శాఖలో భద్రత పేరుతో రుణాలిచ్చి తర్వాత కాలంలో ఆ వ్యక్తి చనిపోయినప్పటికీ వారి కుటుంబ సభ్యులను వేధించి డబ్బులు తీసుకున్న ఇద్దరు మోసగాళ్లను వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్పీ ఎం. దీపిక అందించిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఓ గా విధులు నిర్వహిస్తున్న జి.వెంకటరమణ, కర్లర్క్ జి.వి జయకుమార్ పోలీసు శాఖలో భద్రతా రుణాల వ్యవహారాలు చూస్తుంటారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సమర్పించిన రుణాల డాక్యుమెంట్లను సరిచూసి, ఎలిజిబులిటీ ఇస్తుంటారు. ఇదిలా ఉంటే శాఖాపరంగా రుణం తీసుకున్న వారిలో కొందరు చనిపోయారు. అలా ఎవరైనా మృతి చెందినట్లయితే అక్కడితో వారి అకౌంట్ క్లోజ్ అయిపోతుంది. అయితే ఈ విషయం మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తెలియజేయకుండా రుణం డబ్బులు కట్టాలని ఒత్తిడి తీసుకువచ్చి పలువురి నుంచి చెక్‌లు తీసుకుని సొంతానికి వాడుకున్నారు. ఈ విషయం ఎస్పీ దీపిక దృష్టికి వెళ్లడంతో ఆమె ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీసులు విచారణ చేపట్టగా..ఏఓ వెంకటరమణ, క్లర్క్ విజయకుమార్ తప్పు చేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రేగిడి: మండల పరిధిలోని కోడిశ గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన పెదగాడ హరిబాబు(37) ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఎస్సై ఇ.శ్రీనివాసరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. హరిబాబుకు భార్య పార్వతి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన హరిబాబు మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవలు పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఫిర్యాదు మేరకు వచ్చిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్ హత్య కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామానికి సమీపంలో గత నెల 13న లారీ డ్రైవర్‌ను హత్య చేసి రైల్వే పట్టాలపై పడి వేసిన హత్యకు సంబంధించిన కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసినట్లు గజపతినగరం సీఐ లెంక అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ లారీ డ్రైవర్ జగదీష్ యాదవ్‌ను ప్రయాణికుల ముసుగులో హత్య చేసి లారీతో సహా ఉండాయించి మృతదేహాన్ని పట్టాలపై పడవేసిన ఉదంతంలో ప్రధాన నిందితుడు హరి ఈశ్వర్రావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

దేవుపల్లిలో పులి కలకలం

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామానికి సమీపంలో పులి పాదముద్రలు గురువారం ఉదయం మామిడి తోటల్లో దర్శనమివ్వడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పులి పాదముద్రల గుర్తులను గమనించి గొల్లుపాలెం గ్రామంలో గల ప్రభుత్వ వైద్యాధికారి జగన్‌మోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. వారు వచ్చి పాద ముద్రలను గుర్తించారు. గ్రామస్తులు అందరూ అప్రమత్తంగా ఉండాలని గ్రామంలో దండోరా వేయించారు.

అయ్యో.. ఎంత ఘోరం...

విద్యుత్ తీగలు వారి పాలిట మృత్యు పాశాలయ్యాయి. ఇనుప రాడ్ రూపంలో ప్రాణాలను కబళించాయి. ఎప్పటిలా కాకుండా ముందుగా ప్రారంభిద్దామనుకున్న పనే వారి పాలిట శాపమైంది. విద్యుత్ షాక్ రూపంలో ముగ్గురిని బలి తీసుకుంది. కుటుంబీకులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. హృదయ విదారకమైన ఈ ఘటన సంతకవిటి మండలం సోమన్నపేటలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు..

- విధి వంచితులు
- విద్యుత్ తీగలే మృత్యు పాశాలు
- విద్యుత్ షాక్‌కు గురై ముగ్గురి మృతి
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు
- సోమన్నపేటలో విషాదం


కేసరినాయుడు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు


చంద్రశేఖర్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు


రెయ్యమ్మ మృతదేహం వద్ద మిన్నంటుతున్న కుటుంబీకుల రోదనలు

రాజాం/సంతకవిటి:

సంతకవిటి మండలం సోమన్నపేట గ్రామంలో గురువారం విద్యుత్ షాక్‌కు గురై గ్రామానికి చెందిన పాంద్రంకి కేసరినాయుడు(24), గండ్రేటి చంద్రశేఖర్(18), దూబ రెయ్యమ్మ(57) మృతి చెందారు. పాంద్రంకి రామినాయుడు ఇంటి మొదటి అంతస్తు నిర్మాణ పనుల్లో భాగంగా అతని కుమారుడు కేసరినాయుడు, అదే గ్రామానికి చెందిన అతని స్నేహితుడు గండ్రేటి చంద్రశేఖర్‌ను పనికి పిలిచి డాబా ఎక్కారు. ఆ సమయంలో డాబా మీద ఉన్న 12 ఎంఎం ఇనుప రాడ్‌ను డాబా వెనుక వైపు నెట్టగా, డాబాకు కొద్ది దూరంలో ఉన్న 230 ఓల్ట్స్ విద్యుత్ సరఫరా తీగలకు రాడ్ తగలడంతో రాడ్‌ను పట్టుకున్న ఇద్దరు యువకులు పెద్దగా కేకలు వేస్తూ మృతి చెందారు. డాబా మీద యువకుల అరుపులను ఎదురుగా ఉన్న అంగన్‌వాడీ ఆయా దూబ రెయ్యమ్మ విని వెంటనే డాబా పైకి వెళ్లి పొరపాటున ఇనుప చువ్వను ముట్టుకోవడంతో ఈమె కూడా మృతి చెందింది. ఈ విషయాన్ని గమనిస్తున్న ఒకరిద్దరు ఏదో జరుగుతుందని ఊహించి డాబా ఎక్కకుండా పొలాల్లో ఉన్న కుటుంబీకులకు సమాచారం అందించారు. గ్రామంలోకి వచ్చిన కిరాణా సరుకుల రవాణా వ్యాపారి డోల ప్రసాద్ డాబా వెనుక వైపునకు వెళ్లి ఇనుప రాడ్ స్ట్రీట్ లైన్ విద్యుత్ తీగలకు తగిలి ఉండడాన్ని గమనించి ఎలక్ట్రికల్ ఏఈకి వెంటనే ఫోన్ చేసి విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయించారు. అనంతరం డాబా ఎక్కి ముగ్గురు పడి ఉండడాన్ని గమనించి వారిని కిందకు దించారు. ముగ్గురిలో చంద్రశేఖర్ కొన ఊపిరితో ఉన్నాడనే అనుమానం రావడంతో వెంటనే ప్రైవేట్ వాహనంలో సంతకవిటి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో తిరిగి గ్రామానికి తీసుకొచ్చారు. వీఆర్‌వో కనకమ్మ ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వగా రాజాం రూరల్ సీఐ సీహెచ్ ఉపేంద్ర, సంతకవిటి ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం రాజాం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తరలించి అనంతరం బంధువులకు అప్పగించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

ఆరు నెలలు గడవక ముందే..

ఈ ఘటనలో మృతి చెందిన పాంద్రంకి కేసరినాయుడు తల్లి చిన్నమ్మడు ఆరు నెలలు క్రితమే మృతి చెందింది. కేసరినాయుడుతో పాటు తండ్రి రామినాయుడు, సోదరుడు కోటిబాబు కలసి ఉంటున్నారు. కేసరినాయుడు డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉంటూ తండ్రికి పొలం పనుల్లో సాయం చేస్తున్నాడు. అన్నయ్య విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఊరికి వచ్చిన తన సోదరుడు బుధవారం విశాఖపట్నం వెళ్లిపోయాడు. ఇంతలోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆ ఇంట తీవ్ర విషాదాన్ని నింపింది. ఆరు నెలల వ్యవధిలో తల్లీకొడుకులు మృతి చెందడం స్థానికులను కన్నీరు పెట్టించింది.

ఒక్కగానొక్క కొడుకు..

ఈ ప్రమాదంలో మృతి చెందిన గండ్రేటి చంద్రశేఖర్ కుటుంబానిది మరో విషాద గాథ. గండ్రేటి కేసరి, సూరీడమ్మలకు చంద్రశేఖర్ ఒక్కడే కుమారుడు. ఒక్కగానొక్క కుమారుడిని అల్లారు ముద్దుగా చూసుకుంటున్న తల్లిదండ్రులు రాజాంలో నాగావళి ఐటీఐలో ఫిట్టర్ కోర్సులో చేర్పించారు. గురువారం కళాశాల ఉన్నప్పటికీ స్నేహితుడు కేసరినాయుడు ఇంటి పనికి వచ్చాడు. మృత్యువులో కూడా స్నేహితునితో కలసి వెళ్లిపోయాడు. తమ కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేక ఆ తల్లిదండ్రులు మాకెందుకు ఈ జీవితం అంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఒక్కరే ఉంటూ..

ఈ ప్రమాదంలో మృతి చెందిన దూబ రెయ్యమ్మ ఒక్కర్తే ఉంటున్నారు. ఈమెకు భర్త లేరు. గ్రామంలో అంగన్‌వాడీ ఆయాగా ఉంటూ కాలం నెట్టుకొస్తుంది. ఈమెకు ఒక్క కుమార్తె భవానీ కాగా ఆమెకు పెళ్లి చేసి, తానొక్కర్తే జీవనం సాగిస్తుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు ఏమి జరిగిందో తెలుసుకుని వారిని కాపాడేందుకు డాబా ఎక్కి మృత్యువాత పాడింది. ఈమె మృతిని కుమార్తె జీర్ణించుకోలేక బోరున విలపిస్తుంది.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ జగన్మోహనరావు, సీఐ ఉపేంద్ర


ఘటనకు కారణమైన విద్యుత్ తీగలు

ఎంపీ, ఎమ్మెల్యేల సంతాపం

సోమన్నపేట గ్రామంలో జరిగిన ఘటనకు సంబంధించి రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పొగిరి సత్యంనాయుడుతో పాటు సంతకవిటికి చెందిన జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావులకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరో వైపు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఈ ఘటనపై మృతుల కుటుంబాలకు సానుభూతి తెలపడంతో పాటు ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని సూచించారు. ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్‌లో జరగకుండా చర్యలు చేపట్టాలని ఎలక్ట్రికల్ అధికారులకు ఆదేశించారు. సంఘటనా స్థలానికి విద్యుత్ శాఖ రాజాం డీఈఈ జీవీ రమణ, ఏఈఈలు కుమార్, సయ్యద్‌లు చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

మిగిలిన వారి ప్రాణాలు కాపాడిన ఆ ముగ్గురు..

ఇదిలా ఉండగా ఈ ఘటనలో మరింత మంది మృత్యువాత పడే ప్రమాదం ఘటనా స్థలంలో నెలకొంది. అయితే విద్యుత్ ఎర్త్ అవుతుందని అనుమానం వచ్చిన స్థానికురాలు నగిరి పద్మ మిగిలిన వారిని డాబా ఎక్కనీయకుండా అడ్డుకుంది. లేకుంటే మరో ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోయి ఉండేవారు. గ్రామంలోకి వచ్చిన కిరాణా రవాణా వ్యాపారి డోల ప్రసాద్ డాబా ఎక్కుతుండగానే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతుందని గమనించి డాబా వెనుక వైపు వెళ్లి స్ట్రీట్ లైన్‌కు ఇనుపరాడ్ డాబా మీద నుంచి ఉన్నట్లు గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి విద్యుత్ సరఫరా నిలుపుదల చేయించి ప్రాణ నష్టాన్ని నివారించాడు. ఇంకో వైపు విద్యుత్ తీగలు మధ్య ఉన్న రాడ్‌ను గ్రామానికి చెందిన ఆబోతుల అప్పారావు గుర్తించి, వెంటనే అక్కడకు వచ్చి ఎదురు కర్రతో రాడ్‌ను తొలగించి పెద్ద ప్రమాదాన్నే తప్పించారు. లేకుంటే విద్యుత్ సరఫరా డాబా మీదకు వస్తుందని చెబుతున్నప్పటికీ కొంతమంది ఆత్రుతతో డాబా ఎక్కే ప్రయత్నం చేశారు. ఇనుప రాడ్ విద్యుత్ తీగల నుంచి తప్పించకుంటే ప్రమాదం ఇంకా పెద్దదయ్యేది. మరింత ప్రాణ నష్టం జరిగేది.

వీఆర్‌ఎస్ నీటి విడుదల


వీఆర్‌ఎస్ కుడి ప్రధానకాలువ గేట్లు విడుదల చేస్తున్న డిప్యూటీసీఎం రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే వెంకటచినఅప్పలనాయుడు

మక్కువ: వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ కుడి, ఎడమ ప్రధానకాలువల ద్వారా సాగునీటిని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు గురువారం విడిచిపెట్టారు. ముందుగా కుడి ప్రధానకాలువ స్పిల్‌వే వద్ద పూజలు నిర్వహించారు. గంగపూజ చేసి కుడి ప్రధానకాలువ గేట్లు ఎత్తి నీటిని విడిచిపెట్టారు. అనంతరం ఎడమ కాలువ వద్ద పూజలు నిర్వహించారు. రెండు కాలువల నుంచి 100క్యూసెక్కులు చొప్పున పంటకాలువలకు నీటినివిడిచిపెట్టారు. వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్ నీటిమట్టం 161 మీటర్లు కాగా, ప్రస్తుతం 159మీటర్లు నీరు నిల్వ ఉన్నందున రైతుల ఖరీఫ్‌సాగుకు అవసరమైన నీటి కొరత లేకుండా పోయింది.

రైతుశ్రేయస్సే సీఎం లక్ష్యం

రైతుల శ్రేయస్సే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని డిప్యూటీ సీఎం, గిరిజనశాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఈ సందర్భంగా అన్నారు. వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్ వద్ద రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దగెడ్డ ద్వారా రెండవపంట (వేసవిపంట)కు నీరు విడుదలచేయలేదన్న టీడీపీ ఆరోపణలు వింటుంటే నవ్వు వస్తోందన్నారు. సాలూరు నియోజకవర్గంలో ఉన్న ప్రాజెక్ట్‌ల ద్వారా కేవలం ఖరీఫ్‌సాగుకు మాత్రమే నీటిని విడుదల చేస్తారని, వేసవిలో ఆరుతడి పంటలకు మాత్రమే నీరు అందిస్తారన్న విషయం టీడీపీ నాయకులకు తెలియకపోవడం విడ్డూరమన్నారు. రైతులకు ఉచితంగా 9గంటలు సాగునీరు అందిస్తున్నది ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, రైతుల కోసం టీడీపీ ఏంచేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

మంత్రి రాజన్నదొర కృషి ఫలితమే జైకా నిధులు

డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర కృషిఫలితంగానే జైకా నిధులు వచ్చాయని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయంలో ఎమ్మెల్యేగా ఉన్న రాజన్నదొర పట్టువదలని విక్రమార్కుడిలా, అప్పటి జిల్లామంత్రి బొత్స సత్యనారాయణ సహకారంతో జైకా నిధుల కోసం ప్రయత్నం చేశారన్నారు. వీఆర్‌ఎస్ ఆధునికీకరణ పనులు పూర్తయితే మక్కువ, బొబ్బిలి, సీతానగరం మండలాలకు చెందిన 24,700ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, మక్కువ, సాలూరు, మెంటాడ మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు పూడి దాలినాయుడు, పెంట సంజీవునాయుడు, దండి శ్రీను, పి.మధు, ఈఈ ఆర్.అప్పలనాయుడు, డీఈ సురేష్, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, జేఈలు, రైతులు పాల్గొన్నారు.

సెల్ఫీ రాజన్న


సెల్ఫీ తీస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ వరదనీటితో నిండుకోవడంతో ముచ్చటగా కనిపించింది. దీంతో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, మావుడి సోదరులు శ్రీనివాసరావు, రంగునాయుడులతో కలిసి డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర, ఓసెల్ఫీ తీశారు. ఈ సందర్భంగా ఆయన తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. చదువుకున్న రోజుల్లో వీఆర్‌ఎస్ వద్దకు స్నేహితులతో కలిసి వచ్చి ఆడుకునేవారమని, కాసేపు సేదతీరి ఇంటి వెళ్లేవారమన్నారు.

ఏపీయుడబ్ల్యూజే సభలకు ఏర్పాట్లు పూర్తి

- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

విజయనగరం: జిల్లా వేదికగా నిర్వహించతలపెట్టిన ఏపీయూడబ్ల్యూజే 26వ మహాసభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని..ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు విజయనగరం జెడ్పీ సమావేశ మందిరంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ఎస్‌వీ.ప్రసాదరావు తెలిపారు. పదకొండు నియోజక వర్గాల నుంచి వచ్చే పాత్రికేయులతో పాటు నూతనంగా యూనియన్‌లోకి రావాలన్న ఆలోచన ఉన్న సభ్యులకు కూడా మహాసభలకు సాదరంగా ఆహ్వానం పలుకుతున్నామని తెలియజేశారు. ఈ మేరకు గురువారం విజయనగరంలోని అంబటి సత్రం వద్ద ఉన్న ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలకు జాతీయ మీడియా సలహాదారు అమర్, ఐజేయు జాతీయ నాయకులు శ్రీనివాసరెడ్డి, సోమసుందర్, రాష్ట్ర యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఐవీ.సుబ్బారావు, చందు జనార్దన్‌లతో పాటు సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి.ధర్మారావు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులతో పాటు ఉమ్మడి విజయనగరం జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పాల్గొంటారని వివరించారు.

పాత్రికేయులకు సన్మానం

సమావేశంలో జిల్లా కార్యదర్శి పంచాది అప్పారావు మాట్లాడుతూ ఇరవై ఏళ్లు పాత్రికేయ వృత్తిలో ఉన్న పాత్రికేయులకు ఈ సందర్భంగా సన్మానకార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఇంకా సమావేశంలో యూనియన్ నాయకులు వి.మహాపాత్రో, టి.రాధాకృష్ణలు మాట్లాడుతూ మహాసభల అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు నగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల జీఎస్ఆర్ (గురాన సాధూరావు) హోటల్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల జర్నలిస్టుల సదస్సు ఉంటుందని తెలిపారు. అలాగే జెడ్పీలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి కార్యవర్గ ఎన్నికలు జరుగుతాయన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు జీవీ ప్రసాద్, కేజే శర్మ ,సముద్రాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే కంబాల జోగులు


అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగులు

వంగర: ఏనుగులు సంచరిస్తున్న గ్రామాల్లో నష్టం వాటిల్లిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన వంగర మండలంలోని శివ్వాం గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన రైతు వెంకటనాయుడు 30 బస్తాల ధాన్యంతోపాటు రేకుల షెడ్డను ఏనుగుల గుంపుధ్వంసం చేయడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగాం, మద్దువలస, శివ్వాం, బాగెంపేట తదితర గ్రామాల్లో 10 రోజులకు పైగా ఏనుగులు గుంపు నష్టపరిచిన వివరాలను సేకరించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, ఆలుబిల్లి సుదర్శనరావు తదితరులున్నారు.

కొలువుల కాణాచి జేఎన్‌టీయూ

- రెండేళ్ల నుంచి 'జాతీయ నూతన విద్యావిధానం'
- ఆరేళ్లలో 1,071 మందికి ప్లేస్‌మెంట్



జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ల్యాబ్‌లు, తరగతిగదులు



జేఎన్‌టీయూ జీవీ ప్రాంగణం

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల సందడి తాజాగా మొదలైంది. ఈ నేపథ్యంలో ఉత్తమ ప్రమాణాలున్న కళాశాలలను ఎంపిక చేసుకునే పనిలో ఇంజినీరింగ్ అభ్యర్థులు బిజీగా ఉన్నారు. పట్టణ శివారున ఉన్న జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ పరిధిలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఉద్యోగకల్పనలో ముందు వరుసలో ఉంది. రెండేళ్ల నుంచి నూతన విద్యా విధానాన్ని కళాశాలలో అమలులోకి తెచ్చింది. మరో వైపు ఉన్నత విద్యశాఖ ఈ కళాశాల ప్రాంగణంలో జేఎన్‌టీయూ, గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీని గత ఏడాది విద్యాసంవత్సరంలో ఏర్పాటు చేసింది.

నూతన సిలబస్‌తో బోధన

విద్యార్థుల నైపుణ్యం పెంచే విధంగా మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ కోర్సులలో హానర్స్, మైనర్ పేరుతో విస్తరణ డిగ్రీలను గత ఏడాది నుంచి ప్రవేశపెట్టారు. జాతీయ నూతన విద్యావిధానానికి అనుగుణంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి రూపొందించిన నూతన సిలబస్, బోధనావిధానాన్ని అమలులోకి తెచ్చింది. మొత్తం 8 సెమిస్టర్స్‌లో తొలి మూడు మినహా మిగిలిన ఐదు సెమిస్టర్స్‌తోపాటు 10 నెలల ఇంటర్న్‌షిప్ చేయిస్తారు. ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, ట్రిపుల్ ఈ, ఐటీ, మెకానికల్ డిగ్రీలలో 66 సీట్ల చొప్పున, సివిల్, మెటలర్జికల్ సబ్జెక్టు డిగ్రీలలో 33 సీట్లు వంతున కోర్సులను స్థానిక జఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల నిర్వహిస్తోంది.

ఏడేళ్లలో 1,071 మందికి ప్లేస్‌మెంట్

ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి పాలన సమయం 2007లో ప్రారంభమైన ఈ కళాశాల ఏడు కోర్సులలో బీటెక్ డిగ్రీని అందిస్తుంది. దినదినాభివృద్ధి చెందుతూ మౌలిక సదుపాయాలు, బోధనా సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. గడిచిన ఏడేళ్లలో 1,071 మంది విద్యార్థులకు వివిధ కంపెనీలలో అత్యధికంగా రూ.12 లక్షల వార్షిక వేతన ఉద్యోగాలను ఈ కళాశాల ఇప్పించింది. ప్రస్తుతం నడుస్తున్న విద్యా సంవత్సరం నాలుగో సంవత్సర విద్యార్థులు ఇంత వరకు 180 మంది ఉద్యోగాలు సాధించారు.